## అనగనగా... ఒక కథ

# నగరంలో ఒయాసిస్సు

నిజాం ప్రభుత్వం నుంచి భాగ్యనగరం తదితర ప్రాంతాలూ స్వాతంత్ర్యం సిద్ధింపచేసుకున్న సమయం-

విశాలాంధ్ర ప్రదేశం గుండె నిండా తెలుగువాసనలు పీల్చుకుంటూ సంపూర్ణత్వాన్ని సాధించుకున్న ఆ శుభక్షణాల్లో...

బాగ్-నగరం (పువ్వుల తోటల ప్రదేశం) భాగ్యనగరంగా సింగారించుకుంటూన్న రోజుల్లో తెలుగు ప్రాంతం నలుదెసల్నుంచి వచ్చి, వివిధ శాఖల్లో ఉద్యోగించిన ప్రజలు ఒక నాలుగు తోటల నడుమ అందమైన కొండప్రదేశాన్ని సరిచేయించుకుని సువిశాలమైన బస్తీని ఏర్పాటు చేసుకున్నారు.

నాలుగైదు వందల ఇళ్లు విశాలమైన ప్రదేశంలో వెలిశాయి. 20-30 వీధుల్లా విస్తరించిన ఆ విశాలాంధ్ర కాలనీలో ప్రతీ ఇంటికీ..చక్కటి చెట్లు. చాలా ఇళ్లల్లో తియ్యటి నీళ్లబావులూ అది కాకుండా ఊరు బావులూ, రోడ్డుకి రెండు వైపులా ఉన్న చెట్లు కొమ్మలూ కొమ్మలూ కలబోసి నేసిన పచ్చదనాల పందిరిలాంటి ఆ విశాలాంధ్ర కాలనీ ఓ కోనసీమ- ఓ అరకువేలీ- ఓ మాటలో చెప్పాలంటే ఆరోగ్య స్వర్గం . అది గత చరిత్ర. ఆ చరిత్రకి సాక్షి కృష్ణదాస్!

కృష్ణదాస్‌కి 75 ఏళ్లు దాటి ఉంటాయేమో గానీ ఆరోగ్యంగా ఉంటాడు. ఐదు వందల గజాల స్థలంలో ఒక మూలగా కట్టిన ముచ్చటైన చిన్న ఇల్లు. ఇంట్లో బెడ్రూమ్స్‌లో కన్నా ఇంటి చుట్టూ చెట్ల కింద పడుకోవటం అతనికి ఇష్టం. ఆరు ఋతువుల్లో సహకరించే ప్రతీ ఋతువూ తన మంచం ఏదో ఓ చెట్టు కిందే- వర్షాకాలంలో మాత్రం ఇంట్లో పడుకున్న రోజులు ఎక్కువ ఉంటాయి.

భార్య ఆమధ్య మధ్యప్రదేశ్‌లో ఎక్కడో ఉద్యోగం చేస్తున్న కొడుకింటికెళ్లి ఖాయిలా పడి మరణించింది. 'పట్నం గాలి పట్నం నీళ్లూ నీకు పడలేదే' అని భోరుమన్నాడు నగరంలో పల్లె కల్పించుకున్న కృష్ణదాసు.

ఇప్పుడు. ఇంటిలో తను ఏకాకి. కాదు..

ఇంటిచుట్టూ చెట్లు- చెట్లుమీద పిట్టలూ పలకరిస్తుంటాయి. ప్రతీ ఆకూ పండేవరకూ చెట్టునంటి పెట్టుకుని ఉన్నా... రాల్తూనే.. అతనికి ఆశీస్సులు ఇస్తూన్నట్లో - తివాచీ పరుస్తున్నట్లో పులకిస్తుంటాయి. కూరగాయల చెట్లూ ఆకుకూరలూ అయితే సరేసరి! పునాసమావిడి చెట్టు ఏటిపొడుగునా కొత్త ఆవకాయలు ఇస్తోంటుంది - వేపచెట్టు ఆరోగ్యాన్ని వీస్తోంటుంది. 4 వీధులావల ఉన్న కిరాణాకొట్టుకి సైకిలెక్కి వెళ్లి కావల్సినవి తెచ్చుకుంటూ పెరట్లో కరివేపాకు రెబ్బలు తుంపి, తెల్సున్నవాళ్లకి పంచిపెడుతూ అందర్నీ పలకరిస్తూ నిత్య యవనుడుగా ఉంటాడు ఆయన.

అతనికి వయస్సు రాలేదు గానీ.. విశాలాంధ్ర కాలనీకి వయస్సు వచ్చేసింది.

తమ చుట్టుపక్కల ఇళ్లన్నీ.. మొదలు నరికిన చెట్లతో బాటు కూలిపోయాయి. 4 అంతస్తుల నుంచి తొమ్మిదంతస్తుల భవనాల దాకా ఎదిగిపోయాయి. కనుచూపు మేరలో పచ్చదనం లేదు. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్స్ మూలాన్ని సూర్యోదయ సూర్యాస్తమయ సౌందర్యాలు కోల్పోయాడు కృష్ణదాస్.

ఎవర్ని ఏమనగలడు- ఎవరిష్టం వాళ్లది. తమ ఇళ్లని దెవలప్‌మెంట్ అనే పేరుతో ఏ బిల్డర్‌కో ఇచ్చేసి డాబూ-డబ్బూ-ఫ్లాట్ అన్నీ సంపాదించుకుని ఎంజాయ్ చేస్తున్నారు వాళ్లు. వాళ్లని తప్పుపట్టకూడదు.

కానీ కృష్ణదాస్‌కి ఆ కోరికా లేదు. ఆ ధ్యాసా లేదు. అయ్యో.... పచ్చని చెట్లు కూలిపోతున్నాయే - చల్లటి బావులు పూడుకుపోతున్నాయే. తను... కష్టపడి, కలలు కని రూపొందించిన విశాలాంధ్ర కాలనీ కళ్లముందే కనుమరుగవుతోందే అని బాధపడ్డాడు కృష్ణదాసు.

ఆవేళ కాలనీ నిర్మాణానికి తోడుగా ఉండి నానా గోలా చేసి తూర్పువైపు ఎంట్రెన్స్ ఉండేలా ప్లాట్ ఎలాట్ చేయించుకున్న వెంకటేశ్ గౌడ్ కూడా డెవలప్‌మెంట్‌కిచ్చి వెళ్లిపోతున్నాడు. ఇంటి మీదా - ఇల్లాలి మీదా మమకారం లేని వాళ్లు ఉంటారా? కృష్ణదాసు తనలో తనే చాలాసార్లు అనుకున్నాడు - ఎదురింట్లో చెట్టు పక్కింట్లో గోడా కూలిపోతున్నప్పుడు తన కలల్ని ఎవరో తవ్వేస్తున్నట్లు నలిగిపోయేవాడు.

అప్పట్నుంచి తలుపులు బిడాయించి లోపల దాక్కోవటం అలవాటు చేసుకుంటున్నాడు కృష్ణదాసు.

ఇటూ అటూ ఇళ్లు కూలగొట్టి అపార్ట్‌మెంట్ కట్టిస్తున్న రెడ్డిగారొచ్చి మూడూ కల్పి బ్రహ్మాండమైన వెంచర్ టేకప్ చేయాలని సామదాన భేదోపాయాల్తో ప్రయత్నించాడు. ఈయన సమకాలీన స్నేహితుల్తో సామంగానూ, రేట్ ఎక్కువ ఇస్తాననీ రెండు ఫ్లోర్స్ ఇస్తాననీ దానధనోపాయాల్తోనూ హెచ్చరింపుల్తో... భేదోపాయంతోనూ కృష్ణదాసుకి టెన్షన్ పెట్టారు. కృష్ణదాసు చలించలేదు. ఈ ఇంటికి వీలునామా రాసి రిజిస్ట్రేషన్ చేసేశాను అని అంటూండేవాడు.

రెడ్డిగారు మధ్యప్రదేశ్‌లో ఉన్న కృష్ణదాసు కొడుకు దగ్గరికి వెళ్లి అతన్ని ప్రలోభపెడితే పని సానుకూలమవుతుందని ఊహించి గమనించి అక్కడికి వెళ్లాడు.

అతనికి లక్షల లాభాన్ని చూపించి....బుట్టలో పడేశాడు. కృష్ణదాసు కొడుకు సెలవుపెట్టుకొని హైదరాబాద్ వచ్చి తండ్రిని ఈ ఫ్లాట్ కూడా అమ్మేసి సుఖపెట్టమనీ - సుఖపడమనీ చెప్పాడు. కృష్ణదాస్ లొంగలేదు. తండ్రీకొడుకులకి రెండు మూడు రోజుల యుద్ధం ప్రచ్ఛన్నంగా కొనసాగింది.

"ఒరే ఈ ఇంటిమీద ఈ మట్టి మీద నాకు


అతనికి లక్షల లాభాన్ని చూపించి....బుట్టలో పడేశాడు. కృష్ణదాసు కొడుకు సెలవుపెట్టుకొని హైదరాబాద్ వచ్చి తండ్రిని ఈ ఫ్లాట్ కూడా అమ్మేసి సుఖపెట్టమనీ - సుఖపడమనీ చెప్పాడు. కృష్ణదాస్ లొంగలేదు. తండ్రీకొడుకులకి రెండు మూడు రోజుల యుద్ధం ప్రచ్ఛన్నంగా కొనసాగింది.

వ్యామోహం కాదురా ప్రేమ-భక్తి. ఇదిగో ఈ మామిడిచెట్టుకి ఉయ్యాల కట్టి నిన్ను ఊపానురా. ఈ చెట్టు కిందే మీ అమ్మా నేనూ మంచాలు వేసుకుని పడుకున్నాంరా! మశూచికం వొచ్చి నీ కొడుకు అల్లలాడిపోతూంటే.. ఈ వేపచెట్టు ఆకులు వాడి రోగాన్ని ఎగరకొట్టేసి, రక్షించాయిరా. ఈ స్థలం నేను అమ్మను. ఇది వీలునామా రాశాను... నా తదనంతరం దాని ప్రకారం చేస్తే చాలు"

తండ్రి సెంటిమెంట్స్‌కి తలదించుకున్నాడు కృష్ణదాసు కొడుకు. ఇది జరిగిన రెండ్రోజులకి... విజయవాడలో ఉద్యోగం చేస్తున్న మనవడికి ఫోన్ చేశాడు కృష్ణదాసు.

"ఒరే మీ నాన్నతో చెప్పకుండా ఒకసారి రారా.... నీతో మాట్లాడాలి..." అన్నాడు.

చిన్నప్పణ్నుంచీ ఆ మనవడికి తాతయ్యంటే చెప్పలేని ఇష్టం. పైగా ఈమధ్య.. 'కులం తక్కువ అమ్మాయిని ప్రేమించి పెళ్లాడదానికి తండ్రి ససేమిరా వప్పుకోనంటే... కృష్ణదాసు మనవణ్ని గెలిపించాడు. కొడుకుతో పోరాడి మనవడికి ఇష్టమైన మనువు చేయించాడు. దాంతో ఆ మనవడు కృష్ణమూర్తికి తాతగారంటే మరీ గౌరవం పెరిగింది!!



తాతయ్య పిలుపు అందగానే కృష్ణమూర్తి హైదరాబాద్ వొచ్చాడు. తాతయ్య ఆర్గ్యుమెంట్ - సెంటిమెంట్ బాగా అర్థం చేసుకున్నాడు.

"తాతయ్యా నీ ఇష్టాలు, అభిప్రాయాలూ ఎప్పుడూ వీగిపోవు. వీగిపోనియ్యను" అని తాతయ్యకి చెప్పాడు.

కృష్ణదాసు తృప్తిగా నిట్టూర్చాడు.

★ ★ ★

కృష్ణదాస్ ఇంకో పదేళ్లు హాయిగా బతికాడు.

తను కట్టిన విశాలాంధ్ర కాలనీ పేర్లు మారి రూపు మారి కె.ఆర్.నగర్‌గా కొంతమేర బ్రహ్మానందరావునగర్‌గా కొంత భాగం - సంజీవనగర్‌గా మరో కొంత భాగం ఇలా ముక్కముక్కలైంది. ఎటుచూసినా ఆరు నిలువుల ఎత్తుకి తక్కువ కాకుండా ఎపార్ట్‌మెంట్స్ వెలిసిపోయాయి. పెళ్లికూతుర్లాంటి మహానగరానికి అందమైన దిష్టిచుక్కలా కృష్ణదాసు ఇల్లు మిగిలింది.

★ ★ ★

కృష్ణదాసు గతించాక ఆయన రాసిన విల్లు చేతికందింది మనవడు కృష్ణమూర్తికి.

ఆయన కోరుకున్నట్లు కృష్ణమూర్తి ఆ ఇల్లుని ఓ పార్క్‌లా- విశ్రాంతి గృహంగా - కాంక్రీట్ నగరంలో ఒయాసిస్సులో ... అలాగే ఉంచేయాలని తాతగారి వీలునామా ప్రకారం నిర్ణయం తీసుకున్నాడు.

కృష్ణదాస్ కొడుకూ అంగీకరించాడు.

రండి రిలాక్స్ అవండి - 60 ఏళ్లు దాటినవాళ్లకే ప్రవేశం- అని ఆ ఇంటి గేట్లు తీసి వెళ్లిపోయారు కృష్ణదాసు కొడుకూ - మనవడూ.

ఆ తర్వాత.... రిటైరై వచ్చిన కృష్ణదాసు కొడుకు... ఆ చెట్ల నీడని అందరికీ పంచుతూ తానూ అనుభవిస్తూ నాన్న శవం పడుకోపెట్టిన చెట్టు కింద హాయిగా పడుకుంటున్నాడు.

అయితే... అతనికి అప్పుడే మృత్యువురాదు. ఆ చెట్ల ఆకులు అతని ఆరోగ్యాన్ని పెంచుతున్నాయి. ఆయుర్దాయాన్ని పెంచుతున్నాయి.

*